క్లుప్తంగా

24న జప్తు చేసిన బైక్‌లకు వేలం

బెల్లంపల్లి: ఎక్సైజ్ నేరాలలో పట్టుబడి జప్తు చేసిన బైక్‌లకు ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన 9ద్విచక్ర వాహనాలను జప్తు చేసినట్లు తెలిపారు. వీటికి జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల ప్రకారం వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్దేశించిన తేదీలో బెల్లంపల్లి ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఉదయం 11గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వ్యక్తులు వాహన విలువలో 50శాతం ఈఎండీ ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలను పరిశీలించడానికి ఇతర వివరాల కోసం ఎక్సైజ్ కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్ల కోసం మైనారిటీ మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 21వ తేదీ నుంచి మైనారిటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దాని ప్రతిని కార్యాలయంలో సమర్పించాల్సిన అవసరం లేదని, ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే, గురుకుల కళాశాలలో విద్యార్థులకు షీ టీమ్ అధికారులు మహిళలను వేధిస్తే తీసుకునే చర్యలపై, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. షీ టీమ్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, జ్యోతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కమిటీ ఎంపిక

కాసిపేట: ఆదివాసీ సేనా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఈ నెల 22న ఎన్నుకోనున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు మడావి వెంకటేష్, పెందోర్ శంకర్, శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని చార్వాక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జన్మభూమి నగర్‌లో సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని గ్రామ పటేళ్లు, ఆదివాసీ మండలాల అన్ని తెగల ఆదివాసీలు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

పాఠశాల సందర్శన

లక్సెట్టిపేట: విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో రుచికరమైన భోజనం అందించాలని ప్రత్యేక అధికారి సంజీవ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. తరగతి గదులు, వంటగది, పరిసరాలు పరిశీలించారు.

విద్యార్థుల అడవిబాట



అడవుల రక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జన్నారం: అడవుల రక్షణ, అడవుల వల్ల ఉపయోగాలను తెలుసుకోవడానికి శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వనదర్శిని కార్యక్రమంలో భాగంగా రేంజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అడవిబాట పట్టారు. అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని ఘనిషెట్టి కుంట, మైసమ్మ కుంట ప్రాంతాల్లో పర్యటించారు. గడ్డి క్షేత్రాలు, కుంటలు, అడవుల గురించి తెలుసుకున్నారు. అడవులను రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశా రు.

ముందస్తు అరెస్ట్

మందమర్రిరూరల్: ఆటో డ్రైవర్ల చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముందస్తుగా మందమర్రిలోని పలువురు ఆటో డ్రైవర్లను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో రాజేష్, రవి, రాజ్‌కుమార్, సారయ్య, శంకర్, గౌస్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

డిజిటల్ క్లాసులు ప్రారంభం

కాసిపేట: మండలంలోని ఓరియంట్ డీఏవీ పాఠశాలలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్ శుక్రవారం డిజిటల్ క్లాసులు ప్రారంభించారు. డీఏవీ ఓరియంట్ జ్ఞానమందిర్ పాఠశాలకు సీబీఎస్ సిలబస్ వచ్చినట్లు, దీంతో 23తరగతి గదులను డిజిటల్ క్లాస్ రూంలుగా మారుస్తున్నట్లు తెలిపారు. సీబీఎస్ సిలబస్ అనుమతి పత్రాన్ని ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం హెచ్‌ఆర్ ఆనంద్ కులకర్ణి, పాఠశాల సిబ్బంది, ఓరియంట్ అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ సంక్రాంతి రావట్టే..!

- ఇంకా అసంపూర్తిగానే క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్
- 2025 సంక్రాంతి నాటికి పూర్తి చేయాలన్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- అయినా పెడచెవిన పెట్టిన కాంట్రాక్టర్
- పనులు మొదలు పెట్టి పదకొండేళ్లు...
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు



నత్తనడకన సాగుతున్న ఫ్లై ఓవర్ పనులు

రామకృష్ణాపూర్: జిల్లాలోని క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. 11సంవత్సరాలు గడుస్తున్నా.. ఈ బ్రిడ్జి పనులు మాత్రం ఇంకా సాగుతూనే ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నిర్మాణం పూర్తిచేయాలని పలుమార్లు ఆదేశించినా.. ఆ ఆదేశాలు బుట్ట దాఖలు అవుతూనే ఉన్నాయి. నిర్మాణ పనులు చేజిక్కించుకున్న ఆ కాంట్రాక్టర్ ఎమ్మెల్యే ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యేకు.. ఇప్పుడూ అదే మాట చెప్పాల్సిన పరిస్థితి అనివార్యంగానే ఏర్పడింది. అప్పుడెప్పుడో పుష్కరకాలం క్రితం ఎంపీగా మంజూరు చేయించిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఇప్పుడు పదకొండేళ్ల తర్వాత అదీ ఎమ్మెల్యేగా ఉన్న హయాంలోనైనా పూర్తవుతుందా లేదా ? అనే ఊగిసలాట నేడు నెలకొంది. రామకృష్ణాపూర్ నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలో రైల్వేలైన్ ఉన్న సంగతి తెల్సిందే. క్యాతనపల్లి మున్సిపాలిటీని రామకృష్ణాపూర్ పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా అప్పట్లో(2013)లో పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న గడ్డం వివేక్ వెంకటస్వామి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించారు. దాదాపు రూ.33కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టగా, రైల్వేశాఖ ఎప్పుడో తన ఆధ్వర్యంలోని రైల్వే లైన్‌పై భాగంలో బ్రిడ్జి నిర్మాణం ముగించింది. అయినప్పటికీ ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలోని బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండటం గమనార్హం. నిధులు అనుకూలంగా.. ఆశించిన విధంగా ఉండి.. భూసేకరణ పనులు సైతం ముగియగా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే బ్రిడ్జి నిర్మాణం పాలిట శాపంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఏదో ఒక సాకును చూపి పనులు వాయిదా వేయటం కాంట్రాక్టర్ సాకుగా పెట్టుకున్నాడనే విమర్శలు లేకపోలేదు.

ఈ సారైనా పూర్తవుతుందా..!

ఇటీవల ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి క్యాతనపల్లి పట్టణాన్ని సందర్శించారు. రెండు, మూడు సార్లు తన పర్యటనలో భాగంగా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మళ్లీ ఎమ్మెల్యే వివేక్ అధికారులను, కాంట్రాక్టర్‌ను బ్రిడ్జి నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతిలోగా పూర్తవుతుందా అని తెలుసుకొని వారిచ్చిన హామీ మేరకే స్థానిక ప్రజలకు పత్రికాముఖంగా మాట కూడా ఇచ్చారు. పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీ కూడా సంక్రాంతిలోగా పనులు పూర్తిచేయాలని ఆయా సందర్భాల్లో ఆదేశించారు. కాగా తాజా పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఆ కాంట్రాక్టర్ పనులను నత్తనడకన కొనసాగిస్తుండటంతో పనులు వచ్చే సంక్రాంతిలోగా కూడా పూర్తయ్యే అవకాశం లేనట్లేనని తెలుస్తోంది. బ్రిడ్జి నిర్మాణపు పనులను ఇప్పటికైనా వెంటనే పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పదకొండేళ్లయినా పూర్తికాలేదు



క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్‌బ్రిడ్జికి నిధులు మంజూరై పదకొండేళ్లు అవుతోంది. అసలు ఇన్నాళ్లు బ్రిడ్జి పనులు పూర్తికాకపోవటానికి కారణమేమిటో అర్థం కావట్లేదు. అధికారుల నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోకపోవటం వల్లే ఇంత ఆలస్యం అయింది. ఇప్పటికైనా బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి.

– శ్రీధర్‌రెడ్డి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



రైల్వేగేటు వద్ద బ్రిడ్జి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కోసారి గేటు గంటకుపైగా మూసివేసి ఉంటుంది. దీంతో అత్యవసర పనుల నిమిత్తం వెళ్లే వారు ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది చనిపోయారు కూడా. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి బ్రిడ్జిని అందుబాటులోకి తేవాలి.

– దుర్గవెంకట ధనస్వామి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనుల పరిశీలన



సర్వే పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో గణపతి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను జెడ్పీ సీఈవో గణపతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవా లని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్వో కృష్ణప్రసాద్, సిబ్బంది ఉన్నా రు. అందుగులపేట, శంకర్‌పల్లి గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో రాజేశ్వర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్వే పనులు పరిశీలించారు.

'బీజేపీని విమర్శించడం సరికాదు'

తాండూర్: బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పాటు పడుతోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు అన్నారు. తాండూర్ ఐబీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను కాంగ్రెస్‌పార్టీ వక్రీకరించి విమర్శలు చేస్తోందన్నారు. ఆ విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుస్తున్న బీజేపీని విమర్శించడం కాంగ్రెస్‌కు సరికాదన్నారు. దళితులను గౌరవించి వారికి అన్ని రకాల హక్కులు కల్పించి, ఉన్నత భవిష్యత్ కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జన్నారం/మందమర్రిరూరల్/పాతమంచిర్యాల/మంచిర్యాలటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షాను బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని, కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించాలని, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఐద్వా, రైతు సంఘాల నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. దేశాన్ని మతాల పేరుతో విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి తన నిజస్వరూపాన్ని పార్లమెంట్ సాక్షిగా బయట పెట్టిందని జాతీయ మాల మహానాడు నాయకులు ఆరోపించారు. అమిత్‌షా దిష్టి బొమ్మదహనం చేసి అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. జన్నారంలో కాంగ్రెస్ పార్టీ, మందమర్రిలో దళిత సంఘాల నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ నూతన కమిటీల ఎన్నిక



చెన్నూర్: నియామకపత్రం అందిస్తున్న శ్రీహరి

చెన్నూర్/నెన్నెల/జైపూర్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యవర్గ సమావేశాలను శుక్రవారం ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించారు. సమావేశాలకు టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి, రాష్ట్ర నాయకులు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపులు హాజరయ్యారు. చెన్నూర్ యూనిట్ అధ్యక్షుడిగా కుమురం అభిషేక్, ఉపాధ్యక్షుడిగా కిరణ్, కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా తాజోద్దీన్‌లను ఎన్నుకున్నారు. నెన్నెల మండల కన్నెపల్లి యూనిట్ అధ్యక్షుడిగా పద్మనాభం, కార్యదర్శిగా దుర్గం వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా సురేష్ ఎన్నికయ్యారు. జైపూర్‌లో పలువురికి సభ్యత్వం కల్పించారు. ఉద్యోగుల భద్రత, హక్కుల సాధన కోసం యూనియన్ పని చేస్తుందని తెలిపారు. నూతనంగా ఎన్నికై న కార్యవర్గాన్ని సన్మానించారు. ఎన్నికైన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు.

ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

పాతమంచిర్యాల: నాణ్యమైన విద్య, ఉపాధి, భూమి, ఇళ్లు, ఐదు గ్యారంటీలు ప్రభుత్వం అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శుక్రవారం ఐదు గ్యారంటీలు అమలు చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా, జంగంపల్లి స్వామి, రేగుంట రాకేష్, నందిపాటి రాజు, గొడిశెల సురేందర్, రాజేశ్వరీ, పార్టీ నాయకులను పోలీసులు శిబిరం నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీక్షను భగ్నం చేయడాన్ని పార్టీ నాయకులు తీవ్రంగా వ్యతిరేఖించి, ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో మంచిర్యాలను కార్పొరేషన్‌గా ప్రకటించినందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రక్షణపై అవగాహన కలిగి ఉండాలి

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ



మాట్లాడుతున్న జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి రక్షణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. రక్షణ పక్షోత్సవాలు శుక్రవారం ఏరియా వర్క్ షాప్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ తనిఖీ కమిటీ సభ్యులు గనిని సందర్శించి రక్షణ చర్యలు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించి పని చేయాలన్నారు. ఎల్లవేళలా రక్షణను పాటిస్తూ సంస్థ ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ సంవత్సరం కంపెనీ నిర్దేశించిన 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం రక్షణ కమిటీ కన్వీనర్ జీఎం (వర్క్‌షాప్స్) దామోదర్ రావు మాట్లాడుతూ నిర్లక్ష్యంతో పని చేయరాదన్నారు. పూర్వ ప్రమాదాలను తెలుసుకొని మరొకసారి అలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధి ఎం.కొమురయ్య, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(వర్క్ షాప్) రవీందర్) ఎస్ఈ రామ్ రెడ్డి, కమిటీ సభ్యులు రామ్మోహన్, నరేంద్ర కుమార్, రాజకుమార్, సాయి, సందీప్, కోదండరాం, రమేష్, సంక్షేమ అధికారి శంతన్, ఫిట్ సెక్రెటరీ సదానందం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వెల్‌బేబీ షో



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో, మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని-1 డిస్పెన్సరీలో శుక్రవారం కార్మి కుల పిల్లలకు వెల్‌బేబీ షో నిర్వహించారు. శ్రీరాంపూర్‌లో జీఎం ఎల్వీ సూర్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి, మందమర్రి ఏరియాలో జీఎం దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి పోటీలో నిలిపారు. వైద్యులు పోటీల్లో పాల్గొన్న పిల్లలకు పలు ఆరోగ్య పరీక్షల నిర్వహించి వెల్‌బేబీలుగా ఎంపిక చేశారు. మందమర్రిలో రక్త పరీక్ష నిర్వహించే సెల్ కౌంట్ మిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో శ్రీరాంపూర్‌లో గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి బాజీ సైదా, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, కల్చరల్ టీం కెప్టెన్ ఆర్ చంద్రమోహన్, మందమర్రిలో ఎస్వోటు జీఎం విజయప్రసాద్, డిస్పెన్సరీ డీసీఎంవో నాగేశ్వరరావు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం ఆసీఫ్, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, పిల్లల వైద్య నిపుణురాలు శ్యామల, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. ఈ విషయంలో గుర్తింపు కార్మిక సంఘం ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్‌ను మాఫీ చేయాలని ఈ విషయంలో తమ సంఘం చిత్తశుద్ధితో పోరాటం చేస్తుందన్నారు. ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తాము యాజమాన్యంతో మాట్లాడుతామన్నారు. సీఐటీయూ ఏరియా ఆసుపత్రి పిట్ సెక్రెటరీగా శ్రీకాంత్‌ను నియమించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి, ఐలయ్య, రామస్వామి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మందమర్రిరూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ త్వరలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళనలకు కార్మికవర్గం సిద్ధం కావాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నరసింహారావు పిలుపునిచ్చారు. ఏరియాలోని వర్క్‌షాప్‌లో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు.

బొగ్గుబాయి వార్తలు

ఆర్కే 7 గని సందర్శన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనిని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ సందర్శించారు. గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ తిరుపతితో కలిసి శుక్రవారం ఆయన గనిలోకి దిగి రక్షణ చర్యలు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రూప్ ఇంజనీర్ రవిచరణ్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమావేశాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులపై మల్టీ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఆర్కే 6 గనిపై శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ తిరుపతి కమిటీ ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేశారు. సంస్థ స్థితిగతులను ఉద్యోగులు తెలుసుకొని దానికి అనుగుణంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, గని రక్షాధికారి శ్రీనివాస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదాయపన్ను మాఫీ చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై శుక్రవారం కార్మికులతో మాట్లాడారు. గెలిచిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సాధించడంలో విఫలమైందన్నారు. డిమాండ్ల సాధన కోసం సీఐటీయూసీ దశలవారి ఆందోళన చేస్తుందని కార్మికులు కలిసి రావాలన్నారు. ఆందోళనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ యూని యన్ అధ్యక్షుడు బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలు చేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదాలు శుక్రవారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గాలంటే కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలు కావాలన్నారు. రాజకీయ ప్రమేయం వల్ల సంస్థకు, కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ మైనింగ్ స్టాఫ్ రీజియన్ కార్యదర్శి రాజేశ్వరరావు, నాయకులు నర్సింగరావు, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ లక్ష్మీదేవి బోనాల జాతర



గోదావరి జలాభిషేకం నిర్వహించిన తర్వాత అమ్మవారి ప్రతిమతో గ్రామస్తులు

కోటపల్లి: మండలంలోని సుపాక గ్రామంలో కొలువైన మారెమ్మ లక్ష్మీదేవి బోనాల జాతర సందర్భంగా శుక్రవారం పార్‌పల్లి సమీపంలోని ఉత్తరవాహిని గోదావరి నదిలో అమ్మవార్లకు గ్రామపెద్దలు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి గోదావరిలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా శని, ఆదివారాల్లో జాతర జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీశ్, నాయకులు రాజు, పురుషోత్తం, సాయి, మహేశ్ పాల్గొన్నారు.